శ్రీకాంతాచారికి నేతల ఘన నివాళి



శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

బాలానగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్మబలిదానం చేసిన మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారిని తెలంగాణ ప్రజలు ఏనాటికీ మర్చిపోరని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శ్రీకాంతాచారీ వర్ధంతి సందర్భంగా బాలానగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎండీ ఖాజ, సీనియర్ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, డి. కృష్ణమూర్తి, వెంకటేశ్‌గౌడ్, నర్రాదేవెందర్‌రెడ్డి, రంగంపేట శ్రీనివాస్ ముదిరాజ్, బాజాని నాగెందర్‌గౌడ్, రామచంద్రాచారి, కందుల రమేష్, ప్రేమ్‌కుమార్, ముత్యాల మురళీధర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'సంఘ్' పోరాటం : రాఘువయ్య



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంప్లాయిస్ సంఘ్ పోరాటం చేస్తున్నదని సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య స్పష్టం చేశారు. రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు బుధవారం నుంచి జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైల్వేలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకాలకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. ఉద్యోగులు, అధికారులు తమ ఓటును రైలింజన్‌పై వేసి సంఘ్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం ప్రయోజనాలను అందించేందుకు సంఘ్ కృషి చేస్తోందన్నారు.

ఏఐటీయూసీ ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకాలనీ ఏఐటీయూసీ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం నేతల సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గురు కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ అంకాల శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా గజ్జల వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా మర్రి నోమేష్, కోశాధికారిగా జి.కృష్ణ, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా బట్టు సుబ్బరాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.మారుతి, ఎస్.ప్రవీణ్, టి.బాలు, పి.యుగేందర్, డి.రామారావు, చంద్రశేఖర్, సంయుక్తకార్యదర్శి కొప్పుల సర్వేష్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా రవి గౌడ్, ఓ.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా వైకాసులు, టి.మల్లి, ఎం.నాగరాజు, శంకర్ నాయక్, వీరబాబు, గోపాల్, సత్యనారాయణ, ఎం.నర్సింహులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అంకాల శ్రీరాములు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత, డ్రైవింగ్ లైసెన్స్‌లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సవరించరూ..!



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన ఉత్సవాలపై జీహెచ్ఎంసీ మూసాపేట్ సర్కిల్ - 23 అధికారులు బ్యానర్ ఏర్పాటు చేశారు. దారిన పోయేవారంతా అచ్చుతప్పులను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి)

'విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం'

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు దాతల సహకారంతో ఉపాధి కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, శిరీషబాబురావు, సబీహాబేగం, మహేందర్‌తో కలిసి ప్రభుత్వం నుంచి మంజూరైన రుణాలు, మూడు చక్రాల వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు. టౌన్ వికలాగుల సైమక్య గౌరవ అధ్యక్షులు వేల్పుగొండ వెంకటస్వామి, జంట సర్కిళ్ల ప్రాజెక్టు ఆఫీసర్ లగాని ఇంద్రసేన, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సురేష్, కొండబత్తిని మురళి, మహిపాల్‌రెడ్డి, ఇందిర, ప్రసాద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీలో బుధవారం కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, శిరీష బాబురావుతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించనున్నారు. బుధవారం మూడోఫేజ్‌లో నిశ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఉచిత కుట్టుశిక్షణ ప్రారంభం, ఏడోఫేజ్ దోబీఘాట్, 15వ ఫేజ్ జంగిల్ పార్కు వద్ద డ్రైనేజీ సమస్యలను పరిశీలించనున్నారు.

బిల్డర్ ఇంట్లో చోరీ

● ముగ్గురు నిందితుల అరెస్ట్ ● రూ. 50 లక్షల సొత్తు రికవరీ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఓ బిల్డర్ ఇంట్లో చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి మంగళవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. కూకట్‌పల్లి ప్రాంతం జయనగర్‌లో సీతాప్యాలెస్‌లో నివాస ముంటున్న కామని మధుసూదన్‌రావు(57) బిల్డర్. మియాపూర్‌లో ఉంటున్న తన కుమార్తె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో మధుసూదన్‌రావు దంపతులు ఇంటికి తాళం వేసి కూతురు వద్దకు వెళ్లారు. ఇదిలా ఉండగా.. వివేకానంద్‌నగర్ కాలనీలో కొందరు భాగస్వాములతో కలిసి మధుసూదన్‌రావు కార్యాలయం నిర్వహిస్తున్నాడు. తరచూ డబ్బులు ఎక్కువగా తరలిస్తుంటారు. ఇది చూసిన వీరి కార్యాలయంలో పనిచేస్తున్న కృష్ణాజిల్లా, ఉయ్యూరు ప్రాంతంలోని తోట్లవల్లూరుకు చెదిన నం పంగి లక్ష్మణ్(44), వివేకానంద నగర్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కృష్ణ జిల్లా గుడ్ల వల్లేరుకు చెందిన గుమ్మడి నాగశంకర్(23), గుమ్మడి మురళి(54) తండ్రీకుమారులు. వీరు కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లో నివాసముంటున్నారు. తండ్రి మురళి కారు డ్రైవర్. కుమారుడు మార్కెంటింగ్ సేల్స్‌మన్. మధుసూదన్‌రావు ఇంట్లో ఉండడం లేదని గుర్తించిన వీరిద్దరితో పాటు లక్ష్మణ్ నవంబర్ 28వ తేదీ రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 80 తులాల బంగారు నగలు, వెండి నగలు, రూ. 2లక్షలు దొంగిలించారు. అదే అలమారలో మరో 40 తులాల బంగారు నగలు ఉన్నాయి. ఇంట్లో అలికిడి కావడంతో పక్కింటి వారు లైట్లు వేయగా ఆ ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. మీ ఇంట్లో దొంగతనం జరిగిందని స్థానికులు మధుసూదన్‌రావుకు చెప్పడంతో నవంబర్ 29న కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలానగర్ సీసీ ఎస్, స్థానిక పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించారు. మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 50 లక్షలు విలువచేసే సొత్తును రికవరీ చేశారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన వారికి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో డీసీపీ క్రైమ్స్ కె.నర్సింహ, కె.సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ముత్తు, బి.వెంకటేశం, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

హైదర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేపీహెచ్‌బీ ఎస్సై శ్రీలతరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గాజులరామారా నికి చెందిన నలేగా రమేష్(43) గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సెక్యూరిటీ గార్డు. ఈ నెల 2న విధులు ముగించుకొని తెల్లవారు జామున 3.45 గంటల సమయంలో తిరిగి ఇం టికి వస్తుండగా కేపీహెచ్‌బీలోని జేఎన్‌టీయూ రోడ్డులో ఆల్విన్స్ హౌస్ వద్ద వేగంగా వెళ్తున్న టిప్పర్ లారీ ఒక్కసారిగా యూటర్న్ తీసుకోగా, రమేష్ ద్విచక్రవాహనానికి తగిలింది. దీంతో రమేష్ టిప్పర్ లారీ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రీలెఫ్ట్‌ను బ్లాక్ చేయొద్దన్నందుకు కానిస్టేబుల్‌పై దాడి

బంజారాహిల్స్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫ్రీలెఫ్ట్‌కు అడ్డుగా పెట్టిన వాహనాన్ని తొలగించాలని చెప్పిన ట్రాఫిక్ కానిస్టెబుల్‌పై ఓ యువకుడు దాడి చేశాడు. గుడిమల్కాపూర్‌కు చెందిన ఉమామహేశ్వరరావు మూడేళ్లుగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 2న సీఎం బందోబస్తులో భాగంగా కేబీఆర్ పార్కు వద్ద ఉన్నాడు. ఆ సమయంలో కేన్సర్ ఆస్పత్రి నుంచి బంజారాహిల్స్ వైపు కారులో వెళ్తున్న సోహైల్ అలీఖాన్ సిగ్నల్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేయడంతో కానిస్టేబుల్ ఫోటో తీయడంతోపాటు వాహనాన్ని తొలగించాలని కోరాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కారు దిగిన యువకుడు ఉమామహేశ్వరరావుపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి సోహైల్ అలీఖాన్‌ను అరెస్ట్ చేశారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం.. అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్‌కు చెందిన టి.వనజ, ఎల్.లక్ష్మీనారాయణరెడ్డి, జె.హరిప్రసాద్ అనే నిరుద్యోగులకు ఎం.సాయి కృష్ణారెడ్డితో పరిచయం ఏర్పడింది. సాయికృష్ణారెడ్డి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడంతో ముగ్గురూ కలిసి రూ.6.30 లక్షలు ఇచ్చారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో రూ.71 వేలు తిరిగి ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడంటూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తన

బంజారాహిల్స్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఫిలింనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఓ ప్రైవేట్ పాఠశాలలో నేర్వరి వినయ్‌కుమార్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. 5వ తరగతి చదువుతున్న బాలికను ఈ నెల 2న ట్యూషన్ చెబుతానని తరగతి గదిలోకి పిలిచాడు. అనంతరం ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినయ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



బాలానగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకుడు రాజశేఖర్

బాలానగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆశావర్కర్లకు ఫిక్స్ వేతనం రూ. 18,000 ఇవ్వాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. మంగళవారం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆశావర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, ఆశావర్కర్ల యూనియన్ మహిళా నేతలు అనిత, సబిత మాట్లాడారు. గత ఏడాది(2023) సెప్టెంబరు, అక్టోబరులో 15రోజులు నిరవధిక సమ్మె చేపట్టినప్పుడు అప్పటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి ఆశా వర్కర్ల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని హామీ ఇచ్చారని, ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశావర్కర్ల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని అన్నారు. ఎన్నికలు పూర్తయిన నాటి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలకు ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసిన ఏ ఒక్క సమస్య పరాష్కారం కాలేదని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాల ని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య క్రేంద్రం వైద్యాధి కారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు స్వాతి, పుష్ప, మౌనిక, స్రవంతి, వినోద, సిద్దిక మంజుల, అఫ్రీన్, కల్పన, కవిత, స్వరూప, జ్యోతి, సోని పాల్గొన్నారు.

మాలలు మనువాదులయితే.. మాదిగలు కమ్యూనిస్టులా?

హైదరాబాద్ సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మాలలు మనువాదులయితే, మాదిగలు కమ్యూనిస్టులా? అని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ ప్రశ్నించారు. మాలలు మనువాదులని మందకృష్ణ మాదిగ ఆరోపించడం సిగ్గుచేటని, అవగాహన లేకుండా మాట్లాడటం మంచిది కాదని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాల కులాలు మనువాదులు కాదని నిజమైన అంబేడ్కర్, పూలే వారసులన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, మనువాద, మతవాద పార్టీల పంచన చేరి ఆరోపణలు చేయడం అర్థరమితమన్నా రు. వందల ఏళ్ల నుంచి కలిసిమెలిసి జీవిస్తున్న మాల మాదిగల నడుమ మందకృష్ణ మాదిగ చిచ్చు పెడుతున్నాడన్నారు.

ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలని బైండ్ల భవనీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదుల్ల గౌరీశంకర్ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ నియమించిందన్నారు. మంగళవారం ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కలిసి బైండ్ల కులానికి న్యాయం చేయాలని వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2011 జనాభా గణంకా ల ప్రకారం కేవలం 19వేలజనాభా మాత్రమే బైండ్ల కులాన్ని చూపించారని, అవి తప్పుడు లెక్కలుగా పరిగణించి, ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రకారం బైండ్ల జనాభాను పరిగణలోకి తీసుకొని 6 లక్షలకు పైగా జనాభా కల్గిన బైండ్ల కులానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఏర్పుల భాస్కర్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు చిల్లంపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి ముప్పాళ్ల సుధాకర్‌లు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఎప్పుడిస్తారు?



కేపీహెచ్‌బీలో పాదయాత్రలో రాజేశ్వరరావు, ప్రీతంరెడ్డి, వినోద్

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మించి నట్టేట ముంచారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్ల పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో ప్లకార్డులు చేతబూని పాదయాత్ర చేశారు. బీజేపీ బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్, బీజేపీ కేపీహెచ్‌బీ డివిజన్ ఇన్‌చార్జి ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రజాపాలన ఉత్సవాలా? ఇందిరమ్మ రాజ్యంలో రేషన్ కార్డులు ఇచ్చేదెప్పుడు? ఇందిరమ్మ ఇళ్లు ఏవి? అంటూ ప్లకార్డులతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్రం బాగుపడాలంటే దేశంలో ఉన్నట్లే ఇక్కడ కూడా బీజేపీ అధికారంలో ఉంటేనే మంచి జరుగుతోందన్నారు.

'నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం'

షాపూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని, అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎస్.నర్సింహరెడ్డి, డి.క్రిష్ణలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన రూ.60వేలు, రూ.52,500 చెక్కులను శ్రీశైలంగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా పలు కాలనీల నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు తెలుసుకొన్న ఆయన వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఓబీజీ డిపార్ట్‌మెంట్ స్టేట్ కో-ఆర్డినేటర్ భరత్‌గౌడ్, సంజీవ్‌కుమార్, లక్ష్మణ్, యువరాజ్, వెంకటస్వామి, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణ.. కేసుల ఛేదనపై దృష్టి సారించాలి

● సమీక్షా సమావేశంలో సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి. మేడ్చల్ జోన్ క్రైమ్ సమీక్షా సమావేశాన్ని పేట్‌బషీరాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన క్లియర్ చేయాలని సూచించారు. కిడ్నాప్‌లు, హత్యలు, స్నాచింగ్‌లు, మిస్సింగ్, దోపిడీలు,దొంగతనాలతో పాటు.. చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడుతున్న పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సైబర్ క్రైమ్‌తో పాటు.. విపరీతంగా పెరిగిపోతున్న ఆర్థిక మోసాలు, భూ కబ్జాలు, మాదక ద్రవ్యాలు (ఎన్డీపీఎస్) కేసులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఛేదించిన కేసుల్లో సాంకేతిక, సైంటిఫిక్ ఎవిడెన్స్‌తో సాక్ష్యాధారాలను సేకరించి నేరస్థులకు తగిన శిక్షలు పడేలా న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, క్రైమ్స్ డీసీపీ నరసింహా, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన, సైబర్ క్రైమ్ డీసీపీ శ్రీబాల, ఎస్ఓటి డీసీపీ శ్రీనివాస్, మేడ్చల్ ఏసీపీ పురుషోత్తం, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, మహిళా భద్రత విభాగం ఏసీపీ ప్రసన్న కుమార్, ఇతర ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

'నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం'

బాలానగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయని బాలానగర్ ఏసీసీ హనుమంతారావు అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధి రాజూకాలనీ కనకదుర్గా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను సీఐ నర్సింహరాజుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసు సిబ్బందితో సమానమన్నారు. సీఐ నర్సింహరాజు మాట్లాడుతూ... బస్తీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల సభ్యులు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడమే కాదు, నేరాలకు పాల్పడిన దొంగలను, నేరస్థులను పట్టుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రామ్‌నారాయణ్, బాలానగర్ పోలీసులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ర్యాంగింగ్‌కు పాల్పడితే చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ నర్సింహరాజు

బాలానగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ర్యాంగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్‌ను ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని బాలానగర్ సీఐ నర్సింహరాజు హెచ్చరించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలోని గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాలలో ర్యాంగింగ్ నియంత్రణ, రహదారి భద్ర, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ... కళాశాలల్లో ర్యాంగింగ్ కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని విద్యా సంస్థల యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రామ్‌నారాయణ, పోలీసు సిబ్బంది, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో.. బీఆర్ఎస్ నేతలు!

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం వారివారి డివిజన్లలోని బస్తీ దవాఖానాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందులు, వసతులు తదితర అంశాలను రోగులను, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బస్తీ దవాఖానాల పరిస్థితి అధ్వానంగా మారిందని కార్పొరేటర్లు ఆరోపించారు.



పర్వత్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, రోగుల బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు



బాలాజీనగర్‌లో కార్పొరేటర్ శిరీషబాబురావు

అల్లాపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. దవాఖానాలోని రోగులతో ఆయన మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. నిరుపేదలకు కూడా మంచి వైద్య వసతులు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన బస్తీ దవాఖానాలకు సుస్తీ చేసిందన్నారు. ఆస్పత్రుల్లో కనీస వసతులు, సిబ్బంది, బీపీ, షుగర్ పేషంట్లకు కూడా మందులు అందించలేని స్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందన్నారు. పర్వత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత, ల్యాబ్ టెక్నీషియన్ లేక రక్త పరీక్షలు, ఇతర టెస్టులు నిలిచిపోయాయని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. పేదలకు వైద్యం అందచలేని ప్రస్తుత ప్రభుత్వం.. సంవత్సర కాలంలో ఏమి సాధించారని సంవత్సరపు వేడుకలు జరుపుకుంటోందని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, లేదంటే టీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపుల పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్లాపూర్ కార్పొరేటర్ సబీహ బేగం, ఎండీ. గౌసుద్దీన్, బాబురావు, సత్యనారాయణ, ప్రభాకర్ గౌడ్, జిల్లా గోపాల్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్లలో..



కేపీహెచ్‌బీలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

● కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీదవాఖానాలను మంగళవారం కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీషబాబురావు తనిఖీ చేశారు. మందుల కొరత ఉండడం అలా ఉంచితే కనీసం రిజిస్టర్‌లో కూడా నమోదు చేయలేనంత బిజీగా ఉన్నారా అంటూ డాక్టర్లు, నర్సులను ప్రశ్నించారు. ఒక్కోసారి షుగర్, బీపీ మందులు కూడా ఇవ్వడం లేదని, పదేపదే దవాఖానాల చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు రోగులు కార్పొరేటర్లకు విన్నవించారు.

ఫిరోజ్‌గూడాలో...



ఫిరోజ్‌గూడా బస్తీ దవాఖానాలో వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని ఫిరోజ్‌గూడ, దిల్‌కుష్‌నగర్‌లోని బస్తీ దవాఖానాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను మంగళవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి డివిజన్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. బస్తీ దవాఖానాల్లో ఉన్న సమస్యలపై మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం అందజేసినా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదని కార్పొరేటర్ అన్నారు. ఇప్పటికైనా బస్తీ దవాఖానాలో రోగులకు మందులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఫతేనగర్ జింకల వాడలో...



జింకల వాడలో వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్ : ఫతేనగర్ డివిజన్ జింకల వాడలోని బస్తీ దవాఖానాలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌సర్కార్ స్పందించి బస్తీ దవాఖానాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో..



శాంతినికేతన్ కాలనీ బస్తీ దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

● ఓల్డుబోయినపల్లి: డివిజన్ పరిధి శాంతినికేతన్ కాలనీలోని బస్తీ దవాఖానాను మంగళవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తనిఖీ చేసి అక్కడ రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్‌గౌడ్, కర్రెజంగయ్య, మక్కల నర్సింగ్, సయ్యద్ ఎజాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజాపాలన 2కే రన్

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం జీహెచ్ఎంసీ మూసాపేట్ సర్కిల్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద ఉదయం 6.30కు ప్రారంభమయ్యే రన్‌కు సర్కి ల్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది హాజరై విజయవంతం చేయాలని డీసీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. ఐడీఎల్ ట్యాంక్ నుంచి మూసాపేట్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు రన్ ఉంటుంది.

వన భోజనాలు

జీడిమెట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల ఆర్టీసీ డిపోలో ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులకు మంగళవారం కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. డిపో మేనేజర్ ఆంజనేయులు వారికి ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

అంగవైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- చందానగర్ పీజేఆర్ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

చందానగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం శరీరానికి తప్ప మనసుకు కాదని.. ఎంచుకున్న రంగాల్లో ప్రతిభ కనబరిచి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవం సందర్భంగా చందానగర్ పీజేఆర్ స్టేడియంలో మంగళవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలువురు మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని, వారు ఎంచుకున్న రంగాల్లో ఉన్నతంగా నిలవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో పాటు ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి సహాయసహకారాలు అందజేస్తుందన్నారు. శేరిలింగంపల్లిలో 125, చందానగర్‌లో 143 మందికి వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


దివ్యాంగులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు


దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందచేస్తున్న భెల్ ఈడీ రాజా

వివక్ష లేకుండా చూడాలి

హైదర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాలు, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని హైదర్‌నగర్ హెచ్ఎంటీ హిల్స్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగులను సమాజంలో ఎటువంటి వివక్ష లేకుండా సమానంగా చూడాలన్నారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. జీహెచ్ఎంసీ, ఎలైమ్ ఇండియా సంస్థ సమన్వయంతో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు, సహాయ పరికరాలు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, మాధవరం రోజాదేవి, దివ్యాంగులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నల్లగండ్లలో

గచ్చిబౌలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నల్లగండ్ల గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేశారు. ఆత్మవిశ్వాసంతో దివ్యాంగులు ముందుకు వెళ్లి అనుకున్నది సాధించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత నందించాలి

భెల్‌కాలనీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను చేరదీసి సహాయం చేయడమే నిజమైన మానవత్వమని బీహెచ్ఈఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భరణీధర్ రాజా అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం భెల్ టౌన్‌షిప్‌లోగల కార్యాలయంలో నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈడీ టీకే.రాజా మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం తోడుంటే దివ్యాంగులు సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. ప్రతి ఒక్కరు దివ్యాంగులకు చేయూత నివ్వాలని వారిని వేరుగా చూడకుండా ఆదరించాలన్నారు. దివ్యాంగులను ప్రోత్సహిస్తే కొలుకోవడంతో పాటు ఆయా రంగంలో విజయం సాధిస్తారన్నారు. భెల్ యాజమాన్యం సీఎస్ఆర్ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతూ దివ్యాంగులకు చేయూతనందిస్తోందన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు సైకిళ్లు, పరికరాలు, చేతి కర్రలను అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, వివిధ విభాగాల అధికారులు, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


దివ్యాంగులతో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


ప్రేంనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్

సీసీ రోడ్డు పనుల పరిశీలన

గచ్చిబౌలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ ప్రేంనగర్ ఏ-బ్లాక్‌లో 20, 21 వీధుల్లో రూ.32 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ హమీద్‌పటేల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పనులు జరిగే సమయంలో అధికారులు తనిఖీలు చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. కార్యక్రమంలో రూపారెడ్డి, సయ్యద్‌ఉస్మాన్, సంతోష్, నారాయణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

గచ్చిబౌలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సురభికాలనీ, లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో ఉప కమిషనర్ ముకుందారెడ్డి, అధికారులతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను తెలుసుకుని వాటిని అక్కడిక్కడే పరిష్కారించడానికే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కార్పొరేటర్ తెలిపారు. సురభికాలనీ, రాజీవ్‌గృహకల్ప సరిహద్దులో వర్షపునీరు నిలిచిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాకుండా దోమల ఉధృతి పెరుగుతుందని వర్షపునీరు నిల్వకుండాప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో మంచినీరు సరఫరా సక్రమంగా జరగడం లేదని, మరికొన్ని కాలనీల్లో లో ప్రేషర్‌తో వస్తుందని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ ఆయా విభాగాల అధికారులు, వాటర్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.


ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

ప్రభుత్వ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

రాయదుర్గం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ కేశవ్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా ఆర్‌ఓ ప్లాంట్, రినోవేటెడ్ డ్రైనేజీ సిస్టంను ఏర్పాటు చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా హాజరై ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


శాతవాహన కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

హైదర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ శాతవాహన, భాగ్యనగర్ కాలనీ ఫేజ్-1 కాలనీల్లో జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వాసులతో కలిసి పాదయాత చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హెచ్ఎంటీ శాతవాహన, భాగ్యనగర్ కాలనీలో ఫేజ్-1 కాలనీల్లో సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేస్తామని ఎక్కడ రాజీపడకుండా ప్రజలకు అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ నర్సింహరాజు

ర్యాంగింగ్‌కు పాల్పడితే చర్యలు

- బాలానగర్ సీఐ నర్సింహరాజు

బాలానగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ర్యాంగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్‌ను ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని బాలానగర్ సీఐ నర్సింహరాజు హెచ్చరించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలోని గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాలలో ర్యాంగింగ్ నియంత్రణ, రహదారి భద్ర, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ... కళాశాలల్లో ర్యాంగింగ్ కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని విద్యా సంస్థల యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రామ్‌నారాయణ, పోలీసు సిబ్బంది, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

బాలానగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయని బాలానగర్ ఏసీపీ హనుమంతారావు అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధి రాజూకాలనీ కనకదుర్గా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను సీఐ నర్సింహరాజుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసు సిబ్బందితో సమానమన్నారు. సీఐ నర్సింహరాజు మాట్లాడుతూ... బస్తీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల సభ్యులు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడమే కాదు, నేరాలకు పాల్పడిన దొంగలను, నేరస్థులను పట్టుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రామ్‌నారాయణ్, బాలానగర్ పోలీసులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

భెల్‌కాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరిగిన నాడే రక్తం కొరత తీరుతుందని భెల్ టౌన్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ ఎస్టేట్ ఏజీఎం సురన్ ప్రసాద్ అన్నారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ సెంటర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భెల్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్టేట్ ఏజీఎం సురన్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ప్రతీరోజు లక్షలాది మంది సమయానికి రక్తం దొరకక మృతి చెందుతున్నారని అన్నారు. ప్రజల్లో రక్తదానంపై అపోహలు విడనాడాలని, రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమాజ సంక్షేమం కోసం నిర్వహించే కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి.రాజా నిర్వాహకులను అభినందించారు.


రక్తదాతలకు సర్టిఫికెట్లను అందచేస్తున్న ఎస్టేట్ ఏజీఎం సురన్ ప్రసాద్

ఇంటర్నేషనల్ స్కూల్‌లో చెరిక్ 2.0 ప్రారంభం

గచ్చిబౌలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 21వ శతాబ్దపు పిల్లల కోసం మన విద్యావిధానాన్ని మార్చే ప్రాజెక్ట్ చెరిక్ 2.0 పరిచయం చేస్తున్నట్లు గర్వంగా ఉందని పాఠశాల సీఈవో డాక్టర్ పీటర్ మెక్‌లాఫ్లిన్ అన్నారు. మంగళవారం శేరిలింగంపల్లిలోని చెరిక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగరంలో చెరిక్ 1989 నుంచి ఉందన్నారు. విద్యార్థుల సవాళ్లకు అభ్యాసాలను సిద్ధం చేయడమే కాకుండా అంతర్జాతీయ అత్యుత్తమ బోధన, లక్ష్యాలు స్ఫూర్తిగా చూసుకుని కొత్త జాతీయ విద్యావిధానంలో విద్యను బోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ప్రఖ్యాత స్పీడ్ పెయింటర్ విలాస్ నాయక్, సంగీత విద్వాంసుడు బిక్రమ్ గోష్ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద అత్యంత ఆరాధనీయ విద్యాకేంద్రాల్లో ఒకటైన కాగ్నిటా గ్రూప్ ఆసియా సీఈఓ సమీర్ అగర్వాల్ కూడా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. చెరిక్ 2.0 విజన్‌కు జీవం పోసిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల సీఈవో డాక్టర్ పీటర్ మెక్‌లాఫ్లిన్, ప్రతినిధులు

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

బాలానగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆశావర్కర్లకు ఫిక్స్ వేతనం రూ. 18,000 ఇవ్వాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. మంగళవారం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆశావర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, ఆశావర్కర్ల యూనియన్ మహిళా నేతలు అనిత, సబితా మాట్లాడారు. గత ఏడాది(2023) సెప్టెంబరు, అక్టోబరులో 15రోజులు నిరవధిక సమ్మె చేపట్టినప్పుడు అప్పటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి ఆశా వర్కర్ల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని హామీ ఇచ్చారని, ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశావర్కర్ల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని అన్నారు. ఎన్నికలు పూర్తయిన నాటి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలకు ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసిన ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాల ని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య క్రేంద్రం వైద్యాధి కారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు స్వాతి, పుష్ప, మౌనిక, స్రవంతి, వినోద, సిద్ధిక మంజుల, అఫ్రీన్, కల్పన, కవిత, స్వరూప, జ్యోతి, సోని పాల్గొన్నారు.


బాలానగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకుడు రాజశేఖర్


ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేయొద్దన్నందుకు కానిస్టేబుల్‌పై దాడి

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫ్రీలెఫ్ట్‌కు అడ్డుగా పెట్టిన వాహనాన్ని తొలగించాలని చెప్పిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఓ యువకుడు దాడి చేశాడు. గుడిమల్కాపూర్‌కు చెందిన ఉమామహేశ్వరరావు మూడేళ్లుగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2న సీఎం బందోబస్తులో భాగంగా కేబీఆర్ పార్కు వద్ద ఉన్నాడు. ఆ సమయంలో క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బంజారాహిల్స్ వైపు కారులో వెళ్తున్న సోహైల్ అలీఖాన్ సిగ్నల్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేయడంతో కానిస్టేబుల్ ఫోటో తీయడంతో పాటు వాహనాన్ని తొలగించాలని కోరాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కారు దిగిన యువకుడు ఉమామహేశ్వరరావుపై దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి సోహైల్ అలీఖాన్‌ను అరెస్ట్ చేశారు.


నిందితుడు సోహైల్ అలీఖాన్

నివాస భవనంలో వ్యాపారం.. సీజ్ చేసిన అధికారులు

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): నివాసం కోసం అనుమతులు తీసుకొని భవన నిర్మాణం పూర్తయ్యాక వ్యాపార కలాపాలు సాగిస్తున్న భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 92లో ఓ వ్యక్తి నివాస భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని వ్యాపార సముదాయంగా వినియోగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అయినప్పటికి యజమాని తిరిగి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తుండటంతో అధికారులు భవనాన్ని సీజ్ చేశారు.


అధికారులు సీజ్ చేసిన భవనం

రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'సంఘ్' పోరాటం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంప్లాయిస్ సంఘ్ పోరాటం చేస్తున్నదని సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య స్పష్టం చేశారు. రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు బుధవారం నుంచి జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైల్వేలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకాలకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. ఉద్యోగులు, అధికారులు తమ ఓటును రైలింజన్‌పై వేసి సంఘ్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం ప్రయోజనాలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు.

యోగాతో మానసిక సమస్యలు దూరం


యోగా కేంద్రం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

- కార్పొరేటర్ కొలను లక్ష్మి

అమీర్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):బీకేగూడ పార్క్‌లో రూ35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న యోగా షెడ్డు పనులను మంగళవారం సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో యోగా అనేది ప్రతి ఒక్కరి దినచర్యలో భాగమైందన్నారు. యోగాతో మానసిక సమస్యలు, ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. త్వరలోనే ఈ యోగా కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోని తీసుకొస్తామని ఆమె వెల్లడించారు.


బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

బస్తీ దవాఖానాల్లో తనిఖీ

హైదర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర్‌నగర్, బాగ్ అమీర్‌లోని బస్తీ దవఖానాల్లో కార్పొరేటర్ రోజాదేవి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులతో మాట్లాడి రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు, మందులు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీ దవాఖానాల పరిస్థితి అధ్వానంగా మారిందని, 10 నెలల నుంచి ఆస్పత్రుల్లో మందులు స్టాక్ లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైద్యులు, స్టాఫ్‌కు కూడా జీతాలు సరిగా ఇవ్వడం లేదని, గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు ఇవ్వక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా బస్తీ దవాఖానాల్లో సేవలు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, జగదీష్‌గౌడ్, బాబు, యాదగిరి, లక్ష్మయ్య, సోమయ్య, రమేష్‌రావు, సత్యనారాయణ, కొండలరావు, విద్యాసాగర్, శ్రీనివాస్, ప్రవీణ్, మాధవిరెడ్డి పాల్గొన్నారు.


పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్

అబద్ధాలతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్

హైదర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే నైతిక హక్కు లేదని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, హామీలు అమలపై ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, హైదర్‌నగర్ డివిజన్‌లో రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆరు అబద్ధాలు-66 మోసాల పేరుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం కోసం అమలుకాని హామీలు ఇచ్చి అమలు చేయకుండా అబద్ధాలతో కాలయాపన చేస్తుందన్నారు. గృహలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చదువుకునే బాలికలకు స్కూటీలు, కొత్త పెన్షన్స్, కొత్త రేషన్ కార్డ్స్, నిరుద్యోగులకు రూ.4 వేల పెన్షన్లు, ఉద్యమ కారులకు ఇళ్ల స్థలాలు, ఇలా నేక హామీలిచ్చి ఒక్క హామీ కూడా అమలు చేయ్యకుండా రేవంత్ సర్కార్ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీంద్రరావు, మణిభూషణ్, రామరాజు, నరేందర్‌రెడ్డి, నర్సింగ్ యాదవ్, కేశవ్ నరసింహచారి, అరుణ్‌కుమార్, కుమార్‌యాదవ్, వేణుగోపాల్ యాదవ్, నాయకులు నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, వెంకటస్వామి, రెడ్డి, యాదవరెడ్డి, వీరుయాదవ్, కృష్ణ, కృష్ణ, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన టీజీఐసీ 5వ ఎడిషన్ ఏటీ సమ్మిట్

రాయదుర్గం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీజీఐసీ) 5వ ఎడిషన్ అసిస్టెంట్ టెక్నాలజీ (ఏటీ) సమ్మిట్ మంగళవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ టీ-వర్క్స్‌లో జరిగిన ఈ కార్యక్రమం విభిన్న, సమూహాన్ని ఒకచోట చేర్చింది. ఆవిష్కర్తలు, విధాన రూపకర్తలు, పరిశ్రమ నిపుణులు, సామాజిక సంస్థలు ప్రజలకు అందుబాటులో ఉండే సాంకేతికతలను చర్చించడానికి, ప్రోత్సహించడానికి వైకల్యాలు, వృద్ధులు, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. విభిన్న వాటాదారుల మధ్య సహకారాన్ని పెంపొందించడం, సమగ్ర విధానాల కోసం వాదించడం, యుఎన్ అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపుకోవడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో పలువురు పారిశ్రామిక వేతలు పాల్గొన్నారు.

రిలయన్స్ క్యాపిటల్‌లో రుణం ఇస్తామని రూ. 2.10 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ క్యాపిటల్‌లో రుణం ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన 51 ఏళ్ల బాధితుడి నుంచి రూ. 2.10 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొద్దిరోజుల క్రితం నగరానికి చెందిన ఓ వ్యక్తి రిలయన్స్ క్యాపిటల్‌లో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ కాల్‌లో బాధితునికి లైన్‌లోకి వచ్చాడు. రుణం మంజూరు కోసం అవసరమైన ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు స్టేట్‌మెంట్ పంపాలని కోరాడు. ఆ తర్వాత మీ లోన్ మంజూరైందంటూ ఒక లెటర్ పంపాడు. లోన్ డబ్బులు మీ ఖాతాలో జమ చేయాలంటే ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, ఇన్సూరెన్స్, టీడీఎస్ ట్యాక్స్ పేరుతో కొంత డబ్బులు చెల్లించాలంటూ విడతల వారిగా రూ. 2,10,559లు కొల్లగొట్టాడు. ఎంతకూ లోన్ డబ్బులు జమ చేయకపోవడం, ఇంకా డబ్బులు చెల్లించాలని వేధిస్తుండటంతో అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వివేకానంద్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

జీడిమెట్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. జగద్గిరి గుట్ట డివిజన్ శివానగర్‌లో 65లక్షల రూపాయాల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ కె.జగన్‌తో కలిసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రెండు పర్యాయాలు కోట్లాది రూపాయాల నిధులతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రుద్ర అశోక్, నాయకులు బాబుగౌడ్, శశిదర్, బ్రహ్మానందచారి, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.



వన భోజనాలు

జీడిమెట్ల డిపోలో కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఆర్టీసీ ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులకు మంగళవారం నిర్వహించారు. డిపో మేనేజర్ ఆంజనేయులు వారికి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. - జీడిమెట్ల(ఆంధ్రజ్యోతి)

సమస్యల మధ్యే చదువులు

- వెయ్యిమంది విద్యార్థులున్నా వసతులు కరువు
- శిథిలమవుతున్న పాఠశాల భవనం

షాపూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ఈ విషయంలో అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు, త్రాగునీరు, మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండటం ఇలా సమస్యల మధ్య చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సకాలంలో సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

వసతులు కరువు

విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. దాతల సహకారంతో డైనింగ్‌హాల్, కొన్ని తరగతి గదులు ఏర్పాటు చేసినప్పటికీ మరికొన్ని సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ట్యాప్‌లు ఏర్పాటుచేశారు. కానీ వాటిని దొంగలు తీసుకుపోవడంతో ప్రస్తుతం ఉన్న ఒక్క ట్యాప్ దగ్గరే చేతులు కడుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. పేద విద్యార్థులు విద్యనభ్యాసించే ప్రభుత్వ పాఠశాల్లో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వసతులు కల్పించాలని కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం



తాగునీటి ట్యాంక్ వద్దనే కాళ్ళు కడుగుతున్న విద్యార్థులు

సమస్యలను పరిష్కరించాలి



పాఠశాలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించినప్పుడే ఉపాధ్యాయులు చెప్పిన బోధన అర్థమవుతుంది. ప్రభుత్వ పాఠశాలలకు లక్షలు ఖర్చుచేస్తున్నామని అధికారులు చెబుతున్నారే తప్ప, పాఠశాలల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. అధికారులు స్పందించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

- కె. లక్ష్మణ్

వీధి కుక్కల వీర విహారం

- ఆందోళనలో జనం



యాదిరెడ్డి బండ రోడ్డులో నడిరోడ్డుపై కుక్కల సమూహం

కుత్బుల్లాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రధాన చౌరస్తాలతో పాటు చెత్త కుప్పలున్న ప్రాంతాల్లో ఎక్కువగా ఇవి తచ్చాడుతుంటాయి. ఈ ప్రాంతాల్లో బయటకు వెళ్లే స్థానికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్తున్నారు. ప్రధానంగా పద్మానగర్ రింగురోడ్డు, యాదిరెడ్డి బండ, బాపునగర్, వాజ్‌పాయినగర్, జీడిమెట్ల గ్రామం నుంచి షాపూర్ నగర్ వెళ్లే రోడ్డు, రాఘవేంద్రకాలనీ, పాటిగడ్డ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

ఇటీవల కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బౌరంపేటలో ఓ బాలుడు కిరాణా షాపునకు వెళ్తుండగా కుక్క తీవ్రంగా గాయపర్చింది. అదేవిధంగా నిజాంపేట జర్నలిస్టు కాలనీలో ఓ బాలుడిని, దుండిగల్‌లో మరో బాలుడిని కరవడంతో తీవ్రగాయాల పాలయ్యారు. కొంపల్లి ఎన్‌సీఎల్ కాలనీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుంటావని చెబుతున్నారే గానీ, తర్వాత మచ్చుకైనా కనిపించరని ఆయా కాలనీల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో ఉన్న కుక్కలు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

షాపూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని, అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎస్.నర్సింహరెడ్డి, డి.క్రిష్ణలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేలు, 52,500 రూపాయల చెక్కులను శ్రీశైలంగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా పలు కాలనీల నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు తెలుసుకొన్న ఆయన వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఓబీసీ డిపార్ట్‌మెంట్ స్టేట్ కో-ఆర్డినేటర్ భరత్‌గౌడ్, సంజీవ్‌కుమార్, లక్ష్మణ్, యువరాజ్, వెంకటస్వామి, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు, నాలాను సరిహద్దుగా చేసుకుని నిర్మించిన షెడ్

గణేష్‌నగర్‌లో అనుమతుల్లేకుండా షెడ్ నిర్మాణం

- రోడ్డు కబ్జా - రాకపోకలకు ఇబ్బందులు

కుత్బుల్లాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ గణేష్ నగర్ నాలా సమీపంలోని అమ్మ భగవాన్ ఆలయం ముందు ఉన్న ఖాళీ స్థలంలో కొందరు భారీ షెడ్‌ను నాలా ప్రహరీ మీదుగా నిర్మిస్తున్నారు. ప్రభుత్వం నాలాలు, చెరువుల ఆక్రమణలను అడ్డుకునేందుకు హైడ్రాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కూల్చివేతలను చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఆ నిర్మాణం వైపు కన్నెత్తి చూడటంలేదు. ఈ నిర్మాణం వల్ల ట్రాఫిక్ కష్టాలు తప్పవని, దానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే నోటీసులు పంపిస్తున్నామని చెప్పడం గమనార్హం. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ విభాగం సెక్షన్ ఆఫీసర్ రమేష్‌ను వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, ఈ విషయాన్ని పరిశీలిస్తామని అన్నారు. న్యాక్ ఇంజనీర్ జయశ్రీ అడగ్గా అనుమతులు లేవని, నోటీసులు తయారుచేస్తున్నామని, త్వరలోనే వాటిని పంపిస్తామని చెప్పారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

షాపూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ ఈస్ట్ కాలనీ, ఏడవ రోడ్డులో విద్యుత్ స్తంభం ఎప్పుడు విరిగిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత కొంతకాలంగా ఈ స్తంభం పక్కకు ఒరిగిపోవడంతో విద్యుత్ సిబ్బంది స్తంభానికి సపోర్టు పెట్టి కాలం వెళ్ళదీస్తున్నారు.అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఒరిగిపోయిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని వేయాలని కోరుతున్నారు.



పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

ప్రజాపాలన విజయోత్సవాలు

- మహిళా సంఘాలకు చెక్కుల అందజేత
- ప్రతిభావంతులకు ట్రై సైకిళ్ల పంపిణీ
- కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు



పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేయర్ నీలారెడ్డి



కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న కమిషనర్ సత్యనారాయణ

నిజాంపేట్/కుత్బుల్లాపూర్/పేట్ బషీరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రగతినగర్ బతుకమ్మఘాట్ నుంచి మోర్ సూపర్ మార్కెట్ మీదుగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మహిళా సంఘాలు కలిసి 2కె రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేయర్ కొలన్ నీలారెడ్డిలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేశారు. స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను పరిశీలించిన అనంతరం కార్మికులకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్‌లో..

దుండిగల్ ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు నుంచి 2కె రన్ నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేసిన అనంతరం పారిశుధ్య సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ భోజనం చేశారు. స్వయం సహాయక బృందాలకు రూ.3.42 కోట్ల చెక్కులను అందజేశారు. పనిలో ప్రతిభ కనబర్చిన పారిశుధ్య కార్మికులను గుర్తించి కమిషనర్ శాలువా కప్పి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రెవిన్యూ ఆఫీసర్ ప్రభాకర్, ఇంజనీరింగ్ సురేందర్, అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో..

జంట సర్కిళ్ల కార్యాలయంలో జరిగిన ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై ప్రతిభావంతులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు సుమారు రూ.25 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహ తదితరులు

కొంపల్లిలో..

విజయోత్సవాలలో భాగంగా పలు కాలనీలలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులను అందజేసి అనంతరం విధుల్లో ప్రతిభ కనబర్చిన పారిశుధ్య కార్మికులను సన్మానించి నూనె డబ్బాలు, సబ్బులను అందజేశారు. అదే విధంగా ఎస్ఎస్‌జీ సభ్యులకు రూ.1.50 కోట్ల చెక్కు, వీధి వ్యాపారులకు రూ.6 లక్షల చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కమిషనర్ శ్రీహరి తదితరులు

బస్తీ దవాఖానాల తనిఖీ

హైదర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర్‌నగర్, బాగ్ అమీర్‌లోని బస్తీ దవఖానాల్లో కార్పొరేటర్ రోజాదేవి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా ఆమె వైద్యులతో మాట్లాడి రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు, మందులు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీ దవాఖానాల పరిస్థితి అధ్వానంగా మారిందని, 10 నెలల నుంచి ఆస్పత్రుల్లో మందులు స్టాక్ లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైద్యులు, స్టాఫ్‌కు కూడా జీతాలు సరిగా ఇవ్వడం లేదని, గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు ఇవ్వక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమన్నారు.

ఇప్పటికైనా బస్తీ దవాఖానాల్లో సేవలు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, జగదీష్‌గౌడ్, బాబు, యాదగిరి, లక్ష్మయ్య, సోమయ్య, రమేష్‌రావు, సత్యనారాయణ, కొండలరావు, విద్యాసాగర్, శ్రీనివాస్, ప్రవీణ్, మాధవిరెడ్డి పాల్గొన్నారు.

మాలలు మనువాదులయితే.. మాదిగలు కమ్యూనిస్టులా?

- తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాలలు మనువాదులయితే, మాదిగలు కమ్యూనిస్టులా? అని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ ప్రశ్నించారు. మాలలు మనువాదులని మందకృష్ణ మాదిగ ఆరోపించడం సిగ్గుచేటని, అవగాహన లేకుండా మాట్లాడటం మంచిది కాదని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాల కులాలు మనువాదులు కాదని నిజమైన అంబేడ్కర్, పూలే వారసులన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, మనువాద, మతవాద పార్టీల పంచన చేరి ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. వందల ఏళ్ల నుంచి కలిసిమెలిసి జీవిస్తున్న మాల మాదిగల నడుమ మంద కృష్ణ మాదిగ చిచ్చు పెడుతున్నాడన్నారు.

రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'సంఘ్' పోరాటం



మర్రి రాఘవయ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంప్లాయిస్ సంఘ్ పోరాటం చేస్తున్నదని సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య స్పష్టం చేశారు. రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు బుధవారం నుంచి జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రైల్వేలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకాలకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. ఉద్యోగులు, అధికారులు తమ ఓటును రైలింజన్‌పై వేసి సంఘ్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం ప్రయోజనాలను అందించేందుకు సంఘ్ కృషి చేస్తోందన్నారు.

నేర నియంత్రణ.. కేసుల ఛేదనపై దృష్టి సారించాలి

- సమీక్షా సమావేశంలో సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి. మేడ్చల్ జోన్ క్రైమ్ సమీక్షా సమావేశాన్ని పేట్‌బషీరాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కిడ్నాప్‌లు, హత్యలు, స్నాచింగ్‌లు, మిస్సింగ్, దోపిడీలు, దొంగతనాలతో పాటు.. చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడుతున్న పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సైబర్ క్రైమ్‌తో పాటు.. విపరీతంగా పెరిగిపోతున్న ఆర్థిక మోసాలు, భూ కబ్జాలు, మాదక ద్రవ్యాలు (ఎన్డీపీఎస్) కేసులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఛేదించిన కేసుల్లో సాంకేతిక, సైంటిఫిక్ ఎవిడెన్స్‌తో సాక్ష్యాధారాలను సేకరించి నేరస్థులకు తగిన శిక్షలు పడేలా న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, క్రైమ్స్ డీసీపీ నరసింహ, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన, సైబర్ క్రైమ్ డీసీపీ శ్రీబాల, ఎస్ఓటి డీసీపీ శ్రీనివాస్, మేడ్చల్ ఏసీపీ పురుషోత్తం, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, మహిళా భద్రత విభాగం ఏసీపీ ప్రసన్న కుమార్, ఇతర ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలి

- ఏకసభ్య కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఏదుల్ల గౌరీశంకర్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలని బైండ్ల భవనీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదుల్ల గౌరీశంకర్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ నియమించిందన్నారు. మంగళవారం ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కలిసి బైండ్ల కులానికి న్యాయం చేయాలని వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2011 జనాభా గణాంకాల ప్రకారం కేవలం 19వేల జనాభా మాత్రమే బైండ్ల కులాన్ని చూపించారని, అవి తప్పుడు లెక్కలుగా పరిగణించి, ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రకారం బైండ్ల జానాభాను పరిగణలోకి తీసుకొని 6లక్షలకు పైగా జనాభా కల్గిన బైండ్ల కులానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు చిల్లంపల్లి శ్రీనివాసరావు, కోశవాధికారి ఎం.సుధాకర్‌లు పాల్గొన్నారు.

సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నాం

- కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి



పేట్‌బషీరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొంపల్లి మున్సిపల్‌ను స్వచ్ఛ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, స్వచ్ఛ అవార్డును రెండోసారి సాధించేందుకు శ్రమిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

- **పారిశుధ్య సమస్యలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?**

కొంపల్లి పురపాలకసంఘంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, తడి-పొడి చెత్త సేకరణపై దృష్టి సారించామన్నారు.

- **ఎంతమంది పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారు?**

మున్సిపల్‌లో ప్రస్తుతం 132మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా సిబ్బందిని అదనంగా తీసుకుంటామని అన్నారు.

- **ఎలాంటి అభివృద్ధి పనులు చేపడుతున్నారు?**

మున్సిపల్‌లో దాదాపు రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు, కొంపల్లి, దూలపల్లి 6, 11, 14వ వార్డుల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు అందిస్తున్న సమస్యలపై నిత్యం సిబ్బందిని అప్రమత్తం చేస్తూ పరిష్కరిస్తున్నామని చెప్పారు.

- **స్వచ్ఛ అవార్డుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయవద్దని, ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లోనే వేసేవిధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అందరూ భాగస్వాములైతేనే స్వచ్ఛ అవార్డును సాధించుకోగలమని తెలిపారు.

నీటి బిల్లులను సవరించాలని వినతి

దుండిగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేటలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య, అధిక నీటి బిల్లులు వస్తున్నాయని కౌన్సిలర్ పీసరి బాలమణికృష్ణారెడ్డి దృష్టికి బీజేపీ నాయకులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో గ్రామ పంచాయితీ నుంచి మున్సిపల్‌గా ఏర్పడినప్పుడు నీటి బిల్లుల నిర్వహణను హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధీనంలోకి తీసుకుందని అన్నారు. బౌరంపేట గ్రామంలో ఎవరికి సరిపడే విధంగా నీటి సరఫరా రావడంలేదన్నారు. నీరు రాకపోయినా బిల్లులు మాత్రం అధికంగా వస్తున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయితీగా ఉన్నప్పుడు రూ.20లు వచ్చే నల్లా బిల్లు ఒకేసారి రూ.250లు చేయడంతో గడిచిన ఆరు సంవత్సరాలలో రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో గోనె మల్లారెడ్డి, డి.ప్రభాకర్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డిలు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

మల్లంపేటలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

దుండిగల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో వార్డు కౌన్సిలర్ అర్కల అనంత స్వామి కుమారుడు ఓంకార్ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.జగన్, దుండిగల్ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మహేందర్ యాదవ్, భరత్‌కుమార్, ప్రకాష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు